
సాక్షి
ఒడిశా

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 4,00,381లు, వెండి 18 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఒడిశాకు ప్రత్యేక హోదా ఇవ్వలేం

-8లో



గుణాత్మక విద్యపై దృష్టి సారించాలి

-8లో

న్యూస్‌రీల్

ఇద్దరు సైబర్ నేరస్తులు అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన సైబర్ నేరస్తులు

మల్కన్‌గిరి: జిల్లా పోలీసులు ఇద్దరు సైబర్ నేరస్తులను అరెస్టు చేశారు. ఎస్పీ నితీష్ వాద్వానీ తెలిపిన వివరాల మేరకు... గతేడాది మే నెలలో బలిమేల పోలీసుస్టేషన్ పరిధి చిమిటాపల్లి గ్రామానికి చెందిన ఛంచల పంగి అనే మహిళా ఫిర్యాదు మేరకు అరెస్టు చేసినట్లు వెల్లడించారు. తనకు రూ.25 లక్షల లాటరీ వచ్చిందని నేరస్తులు ఫోన్ చేసి, ముందుగా రూ.20 వేలు కట్టాలని చెబితే అది నిజం అని నమ్మి ఆమె రూ.20 వేలను అతడికి పంపించింది. అనంతరం ఆమె మోసపోయినట్లు గుర్తించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అలాగే మత్తిలి సమితి చవులమేరి గ్రామానికి చెందిన జహ్నా పంగి సైతం అలాగే మోసపోయి మత్తిలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదేవిధంగా బలిమెల ఎన్‌ఏసీ పరిధి నలిగూడ గ్రామానికి సోనియా నలి అనే మహిళ రూ.2.5 లక్షలు మోసపోయింది. ఈ మూడు కేసులను నమోదు చేసుకున్న పోలీసులు కొద్ది నెలలుగా దర్యాప్తు చేపట్టి, కందమాల్‌కు చెందిన ప్రదీప్ దేహూరి, కైలాశ్ దెహూరీలను నిందితులుగా గుర్తించి గురువారం అరెస్టు చేశారు. వీరిని మల్కన్‌గిరి పోలీసులు కందమాల్ పోలీసుల సాయంతో మల్కన్‌గిరి తీసుకొచ్చారు. వీరిని విచారించగా ఈ ఇద్దరు వ్యక్తులు ఒడిశా మొత్తం మీద ప్రజలకు ఫోన్‌లు చేసి మోసం చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఇద్దరి పై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

క్షణికావేశంలో భార్య హత్య

- పోలీసుల అదుపులో భర్త



ఇంటిలో పడివున్న సాపాయి మాఝి మృతదేహం

రాయగడ: క్షణికావేశంలో భర్త కొట్టడంతో భార్య ప్రాణాలు కోల్పోయిన ఘటన కాశీపూర్ సమితి దొరగుడ పోలీసుస్టేషన్ పరిధిలోని డికొరాల్ గ్రామం ఆదివాసీ వీధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం యథావిధిగా భోజనం చేసిన భార్య సాపాయి(22) బయటకు వెళ్లిన భర్త మాలికి మాఝి (32) రాకకోసం ఎదురు చూసింది. అనంతరం భర్త ఇంటికి రావడంతో వడ్డించగా భోజనం చేశాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య చిన్న గొడవ ప్రారంభమైంది. అలా మాటామాటా పెరగడంతో కోపంతో భర్త మాలికి పక్కనే ఉన్న ఒక బలమైన ఆయుధంతో భార్య తలపై కొట్టాడు. దీంతో అక్కడికక్కడే సాపాయి కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచింది. విషయం తెలుసుకున్న వీధి ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు భర్తను అదుపులోకి తీసుకున్నారు. గత కొన్నేళ్లుగా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చిన్నట్లు వీధి ప్రజలు చెబుతున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అడవిలో అగ్ని కీలలు



దక్షిణ ఘుముసర అటవీ ప్రాంతంలో మంటలు

బరంపురం: అవిభక్త గంజాం, కొందమాల్ జిల్లా సరిహద్దు ఉత్తర ఘుముసరా, దక్షిణ అడవిలో మంటలు చెలరేగాయి. అగ్ని కీలల్లో చెట్లు తగలబడుతుండడంతో చుట్టుపక్కల గ్రామాల్లో పొగలు కమ్ముకుంటున్నాయి. గత రెండు రోజులుగా వస్తున్న మంటలు ప్రస్తుతం సురడా, బుగడా, హింజిలికాట్ అటవీ ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. దీంతో అటవీ జంతువులు కొండ దిగువ ప్రాంతాలకు ఆహారం, తాగునీటి కోసం వస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. ఉత్తర ఘుముసర కె.నువాగాం గ్రామంలో శుక్రవారం ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామస్తులు భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి బయటికి రావడం లేదు. అదేవిధంగా ఉత్తర గుముసర అటవీ డివిజన్ తారసింగ్, జగన్నాథ్‌ప్రసాద్, ముజగర్, గెలరీ, కెందుఝెయ్ అటవీ ప్రాతాలు మంటలకు దగ్ధమవుతున్నాయి. అయితే సిబ్బంది కొరత, నీటి కొరత కారణంగా మంటలను అదుపు చేయడం కష్టంగా మారుతోందని జిల్లా అటవీ అధికారి అమలా నాయక్ పేర్కొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- సెంచూరియన్ వర్సిటీలో గజజ్యోతి వార్షికోత్సవాలు



పాప్ సింగర్ సంగీత పాఢి

కాంతారా ప్రదర్శన

సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గజజ్యోతి–23 వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు ఉత్సవాలను వర్సిటీ డీన్ (అడ్మినిస్ట్రేషన్) అనితా పాత్రో, డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్ పాఢిలు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. డీన్ (స్టూడెంట్స్ వ్యవహారాలు) డాక్టర్ అతాను దేబ్ పర్యవేక్షణలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వాలీబాల్ ఫీల్డులో డాగ్ షో, తమిళుల వెదురు కర్రతో బ్యాండు, భువనేశ్వర్‌కు చెందిన ఒడియా రూపకం 'సముఖా హైచీ సాగరో కులే', విద్యార్థుల ఫ్లాష్ మాబ్ ఆకట్టుకుంది. అలాగే సంగీతా పాఢి ఒడియా పాటలు, డీజే నైట్, పురిలియా చౌ డాన్స్, రక్తకోరిబి డాన్స్ డ్రామా, కాంతారా ప్రదర్శనలు అలరించాయి.

– పర్లాకిమిడి



పాప్ సింగర్ డా.అర్చనా పాఢి



తమిళ సాంప్రదాయ వాయిద్యం



సముఖా మైచీ సాగరో కులే ప్రదర్శన



వర్సిటీలో డాగ్ షో

టైగర్ రిజర్వ్‌గా డెబ్రిగడ్



డెబ్రిగడ్ స్వాగత తోరణం

- ఒడిశా సర్కారు ప్రతిపాదనకు ఎన్‌టీసీఏ ఆమోదం

భువనేశ్వర్: వన్యప్రాణి ప్రేమికులకు శుభవార్త. సంబల్‌పూర్ జిల్లా డెబ్రిగడ్ వన్యప్రాణుల అభయారణ్యాన్ని నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) టైగర్ రిజర్వ్‌గా ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన మేరకు ఆమోదం తెలపడం విశేషం. 2018 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం డెబ్రిగడ్ వన్యప్రాణుల అభయారణ్యాన్ని టైగర్ రిజర్వ్‌గా ప్రకటించాలని ప్రతిపాదించింది. 2022 డిసెంబర్ 1వ తేదీన అభయారణ్యంలో రాయల్ బెంగాల్ టైగర్‌ను పర్యాటకుల బృందం గుర్తించడంతో డిమాండ్ మరింత బలపడింది. పొరుగు రాష్ట్రం ఛత్తీష్‌ఘఢ్ అడవుల నుంచి పులులు తరచూ డెబ్రిగడ్ వైపు వచ్చి తమ రెండో నివాసంగా మలచుకొని దీర్ఘ కాలం సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారుల్లు పేర్కొన్నారు. దీంతో ఎన్‌టీసీఏ టైగర్ రిజర్వ్‌గా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది.

రాష్ట్రంలో మూడోది

అటవీ పర్యావరణ విభాగం అధికార వర్గాల సమాచారం మేరకు ఇటీవల జరిగిన టెక్నికల్ కమిటీ సమావేశంలో డెబ్రిగడ్ వన్యప్రాణుల అభయారణ్యం, దాని చుట్టుపక్కల అడవులను టైగర్ రిజర్వ్‌గా ప్రకటించే ప్రతిపాదనను ఎన్‌టీసీఏ ఆమోదించింది. సిమ్లిపాల్, సతొ కొసియా రాష్ట్రంలో రెండు ప్రముఖ పులుల అభయారణ్యాలు. తాజాగా డెబ్రిగడ్ రాష్ట్రంలో మూడో టైగర్ రిజర్వ్‌గా వెలుగులోకి వస్తుంది. రాష్ట ప్రభుత్వం దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనుంది. 804.51 చ.కి.మీ విస్తీర్ణంలో విస్తరించి ఉన్న డెబ్రిగడ్ వన్యప్రాణుల అభయారణ్యంలో పులులు, ఇతర మాంసాహార జంతువులు వేటాడే జంతువులు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ ప్రతీ చదరపు కిలో మీటరుకు కనీసం 30 వేటాడే జంతువుల సంచారం తారసపడుతుంది. డెబ్రిగడ్ వద్ద పులుల సంతతి పెరుగుదలకు అనువైన ప్రదేశం' అని వన్యప్రాణుల నిపుణుడు చెప్పారు. అభయారణ్యంలో బైసన్, సాంబార్, చితాల్, చౌసింగ్, అడవి పంది, చిరుత పులి వంటి వన్య ప్రాణుల సంచారం ఉంటుంది. ప్రపంచంలోని అతిపెద్ద గబ్బిలాల ఆవాసాలలో డెబ్రిగడ్ ఒకటి కావడం విశేషం.

నెత్తురోడిన రహదారులు



రాయగడ: ప్రమాదానికి కారణమైన లారీ

రాయగడ: స్థానిక ఎఫ్‌సీఐ కూడలిలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మృతుడు సాయిప్రియ నగర్‌కు చెందిన గంధం శ్రీనివాస్‌రావు (61)గా గుర్తించారు. ఐఐసీ రస్మీరంజన్ ప్రధాన్ తెలిపిన వివరాల మేరకు.. జేకేపూర్ నుంచి రాయగడ వైపు వస్తున్న ఒక లారీ అదే మార్గంలో స్కూటీపై వెళ్తున్న శ్రీనివాస్‌ను ఢీకొంది. ప్రమాదంలో శ్రీనివాస్‌రావుకు తీవ్ర గాయాలవ్వగా, చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అతను చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో లారీ డ్రైవర్, హెల్పర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

తండ్రి, కొడుకులు మృతి

బరంపురం: నగర శివారు లంజియాగడ గ్రామ రహదారిలో ఎదురెదుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో తండ్రి, కొడుకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం వేకువ జామున దిగపండి నుంచి బరంపురం వైపునకు బైక్‌పై తండ్రి, కొడుకులు సునీల్ నాయక్, శక్తిధర్ నాయక్‌లు వస్తున్నారు. అదే సమయంలో వారికి ఎదురుగా సంతోష్, సుదర్శ మాలిక్‌లు మరో ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొన్నారు. వెంటనే అక్కడివారు అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఎంకేసీజీ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే తండ్రి శక్తిధర్ నాయక్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం కొడుకు సునీల్ నాయక్ చికిత్స పొందుతూ మృతి చందాడు. మరో ఇద్దరికీ గాయాలు అవ్వడంతో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాయగడ: ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాస్



బరంపురం: క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

- నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి మురారీ మోహన్ బెహర

జయపురం: బ్యాంకులు, సహకార సంస్థలు ఇచ్చే వ్యవసాయ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి మురారీ మోహన్ బెహర సూచించారు. జయపురంలోని కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్‌లో బ్యాంక్ అధ్యక్షుడు ఇంజినీర్ ఈశ్వర పాణిగ్రహి అధ్యక్షతన వ్యవసాయ రుణాల సంబంధిత సచేతన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురారీ మోహన్ బెహర మాట్లాడుతూ.. రుణాలు సద్వినియోగం చేసుకుంటే రైతులు ఆర్థికాభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. రైతుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కృషి ఉద్యోగి యోజన, పశు పాలన, మత్స్య పరిశ్రమలకు సంబంధించిన పలు పథకాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. రుణాలు అందించే సంస్థల అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈశ్వర్ చంద్ర పాణిగ్రహి మాట్లాడుతూ.. కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ రైతులకు ఇస్తున్న వ్యవసాయ రుణాలపై వివరించారు. సమావేశంలో జిల్లా ఎపికల్ కో–ఆర్డినేటర్ సంతోష్ కుమార్ సాహు, కేసీసీ బ్యాంక్ కార్యదర్శి కృష్ణచంద్ర దాని, రుణ పరిచాలన అధికారి అరుణ కుమార్ సాహు, కేసీసీ బ్యాంక్ పరిచాలన కమిటీ డైరెక్టర్, కొరాపుట్, రాయగడ, మల్కన్‌గిరి, నవరంగపూర్ జిల్లాల్లోని కేసీసీ బ్యాంక్‌ల మేనేజర్లు పాల్గొన్నారు.

శివ పూజకు వేళాయె..!

- కిక్కిరిసిన మార్కెట్లు



గిరి మార్కెట్‌లో జోరుగా అమ్మకాలు

హిందువుల అతి ముఖ్యమైన పండగ మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం మార్కెట్లు కిక్కిరిశాయి. పూజా సామగ్రి అమ్మకాలు జోరుగా కొనసాగాయి. అయితే శివరాత్రి సందర్భంగా నగరంలో ధరలు ఒక్కసారిగా ఆకాశానికి తాకాయి. పూలు, పండ్లు, పూజా సామాగ్రి ధరలు సామాన్యుడికి భారంగా మారాయి. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి, పలాస నుంచి వ్యాపారులు అధిక సంఖ్యలో బరంపురంలో అమ్మకాలు చేపట్టారు.


– బరంపురం



చిన్న బజార్‌లో మొగలి పువ్వులు విక్రయిస్తున్న దృశ్యం



పాత బస్టాండ్‌లో పూజా సామగ్రి విక్రయాలు



పండ్ల అమ్మకాలు చేపడుతున్న దృశ్యం

క్లుప్తంగా

ప్రతిభ కనబర్చిన కళాకారులు



బహుమతి అందుకుంటున్న కళాకారులు

జయపురం: జాతీయ స్థాయి నాటక పోటీల్లో జయపురం కళాకారులు ప్రతిభ కనబర్చారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం జగదల్‌పూర్‌లో మూడు రోజులు నిర్వహించిన పోటీల్లో జయపురం ప్రియ థియేటర్ కళాకారులు ప్రదర్శించిన 'జరా' నాటకాన్ని ప్రదర్శించి ద్వితీయ స్థానం పొందినట్లు కళాకారులు తెలియజేశారు. ఆదివాసీల సంస్కృతీ, సాంప్రదాయాలను ప్రతిభింబించే ఆ నాటకం ఇతివృత్తం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ద్వితీయ స్థానానికి గానూ రూ.51 వేల నగదు, షీల్డు, ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు పేర్కొన్నారు.

చిట్‌ఫండ్ బాధితుల ధర్నా



ధర్నా చేపడుతున్న చిట్‌ఫండ్ బాధితులు

మల్కన్‌గిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒక చిట్‌ఫండ్ కంపెనీలో డబ్బులు కోల్పోయిన బాధితులు శుక్రవారం ధర్నా చేపట్టారు. బాధితుల సంఘం పిలుపు మేరకు ధర్నా చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. గత కొన్నేళ్లుగా దాచుకున్న డబ్బులు చిట్‌ఫండ్‌లో పెట్టడంతో కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ చందన్ కుమార్ బోయికు వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించకుంటే ఏప్రిల్ 11వ తేదీన భువనేశ్వర్‌లో రాష్ట్రస్థాయిలో ధర్నా చేపడతామని తెలియజేశారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన భోగీలు



కొరాపుట్: కొత్తవలస–కిరండాల్ రైల్వే లైనులో కొరాపుట్ రైల్వేస్టేషన్‌కు సమీపంలోని సుక్కు వద్ద శుక్రవారం ఒక గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. విశాఖపట్నం నుంచి ఛత్తీస్‌ఘడ్ జిల్లా బచేలి వైపు వెళ్తున్న రైలు ఒక్కసారిగా పట్టాలు తప్పడంతో ఎనిమిది భోగీలు పక్కకు ఒరిగాయి. విషయం తెలుసుకొని కొరాపుట్, విశాఖపట్నం నుంచి తరలివచ్చిన సహాయక బృందాలు హుటాహుటిన పునరుద్ధరణ పనులను చేపట్టారు. అయితే ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని రైల్వే అధికారులు తెలియజేశారు. ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. పునరుద్ధరణ పనుల అనంతరం రైళ్ల రాకపోకలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

ఒడిశాకు ప్రత్యేక హోదా ఇవ్వలేం



మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- ఒడిశాలో రెండు రోజుల పర్యటన

భువనేశ్వర్: ఒడిశాకు ప్రత్యేక హోదా కల్పించలేమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఆర్థిక కమిషన్ నిబంధన మేరకు భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ ట్యాగ్ మంజూరు చేయబడదని పేర్కొన్నారు. ఒడిశాలో రెండు రోజుల పర్యటనకు వచ్చిన సీతారామన్ నగరం పరిధిలో పలు వర్గాలతో బడ్జెట్ అనంతర చర్చని వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కొండ ప్రాంతాలు, వ్యూహాత్మక అంతర్జాతీయ సరిహద్దులు, ఆర్థిక, మౌలిక సదుపాయాల పరంగా వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక కేటగిరీ హోదా కల్పించేందుకు కేంద్రం ప్రామాణికాలుగా పరిగణిస్తుండగా, ఒడిశా తన విస్తారమైన వెనుకబడిన ప్రాంతాలు, తుఫానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు తరచుగా సంభవిస్తున్నాయని పేర్కొంటూ ప్రత్యేక హోదాను కోరుతోందని వెల్లడించారు. కేంద్ర బడ్జెట్ – 2023లో ప్రకటించిన పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ (పీఎం–వికాస్) యోజన ఒడిశాలోని కళాకారులకు ఎంతో మేలు చేస్తుందని వివరించారు. ఉపాధి హామీ పథకం నిధుల కేటాయింపులో ఎలాంటి తగ్గింపు జరగలేదన్నారు. కాలానుగుణంగా తలెత్తే అవసరాల అనుపాతంలో ఈ పథకం కింద నిధులు మంజూరవుతాయని వివరించారు. ఇది డిమాండ్ – ఆధారిత కార్యక్రమంగా ఆమె పేర్కొన్నారు. జీఎస్టీ పరిహారం విధానాన్ని 2026 సంవత్సరం వరకు పొడిగించినట్లు తెలిపారు. ఇంకా కేంద్రం బియ్యం సేకరణ తగ్గించలేదన్నారు. దళారుల జోక్యాన్ని తొలగించేందుకు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా ఎంఎస్‌పీని పంపిస్తామని వెల్లడించారు.

ఐఐటీ విద్యార్థులతో ముఖాముఖీ

స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ) క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి ప్రత్యక్షంగా పాల్గొన్నారు. విద్యార్థులు లేవనెత్తిన పలు బడ్జెటు అనుబంధ సందేహాలకు వివరంగా సమాధానాలిచ్చారు. ఇంజినీరింగ్ విద్యారంగంలో సాంకేతిక సమాచారం, కంప్యూటర్ వంటి పలు రకాల కొత్త విభాగాలు చేరుతుండడంతో సంప్రదాయ సివిల్, మెకానికల్ వంటి విభాగాల విద్యార్థుల భవిష్యత్‌పై ఏమైనా అభయం ఇస్తారా? అనే ప్రశ్నపై మంత్రి భావోద్వేగంతో స్పందించారు. తప్పకుండా ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక ప్రోత్సాహంతో ముందుకు నడిపిస్తామని విద్యార్థులకు అభయం ఇచ్చారు.

బాల్య వివాహాల విముక్తి జిల్లాగా గజపతి



మాట్లాడుతున్న కలెక్టర్ లింగరాజ్‌పండా, పక్కన ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ తదితరులు


- కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: గజపతి జిల్లాను బాల్య వివాహాల విముక్తి జిల్లాగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ లింగరాజ్ పండా గురువారం తెలియజేశారు. జిల్లాలోని ఏడు సమితి కేంద్రాలు, 149 గ్రామ పంచాయతీలు, పర్లాకిమిడి పురపాలక, కాశీనగర్ ఎన్ఏసీలలో 29 వార్డులు, మొత్తం జిల్లాలో 1,710 గ్రామాలు బాల్య వివాహాల విముక్తిగా ప్రకటించామన్నారు. బాల్య వివాహాల నివారణకు చైల్డ్ మ్యారేజ్ ప్రోహిబిషన్ అధికారి పనిచేస్తారని తెలియజేశారు. దీనిలో భాగంగా బాల్య వివాహాల రద్దుపై జిల్లా యంత్రాగం ప్రతీ గ్రామంలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తుందన్నారు. గ్రామస్థాయిలో బాలికల సంరక్షణ కమిటీలు తరచూ సమావేశమై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు సమావేశాలు ఏర్పాటు చేస్తారు. గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు చేయడానికి ఉపక్రమిస్తే వారిని నివారించడం, బాలబాలికలను తిరిగి స్కూళ్లకు పంపడం, వారిలో నైపుణ్య విద్య, వొకేషనల్ ట్రెనింగ్‌కు అవకాశాలు, బాధిత కుటుంబాలును సామాజిక సంరక్షణ పథకంలో చేర్పించడం అధికారులు చేపడతారు. సమావేశంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఏడీఎం సంగ్రాం శేఖరపండా, డీసీపీయూ (జిల్లా శిశు సంరక్షణ అధికారి) అరుణ్ కుమార్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



మీనాజోల కొండపై మెట్ల నిర్మాణం



పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

రాయగడ: స్థానిక పీహెచ్‌డీ కొండపై ఉన్న బాలింకేశ్వర మందిరంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అన్నదాన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమయ్యింది. అత్యంతపురాతన మందిరంగా గుర్తింపు పొందిన ఇక్కడ ప్రతీ ఏడాది శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో స్థానిక సాయి భక్తులు, కల్యాణ వేంకటేశ్వర మందిరం సేవా సమాజ్ భక్తులు అన్నదాన కార్యక్రమాల్లో సేవలందిస్తున్నారు. ఈనెల 21వ తేదీ వరకు అన్నదానం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు.

అభివృద్ధి కార్యక్రమాలు

అత్యంత చారిత్రాత్మక ప్రాంతమైన మీనాజోల శైవక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం ఈసారి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం చేపట్టింది. గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోకి వస్తున్న ఈ శైవ క్షేత్రంలో ఈసారి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని అంచనా వేసిన అధికారులు దానికి అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టారు. కొండల నడుమ ఎత్తైన పర్వత ప్రాంతంలో ఉన్న మీనకేశ్వరుని దర్శించుకునేందుకు వీలుగా సుమారు రూ.20 లక్షలను వెచ్చించి ఇనుప మెట్లను చేస్తున్నారు. అదేవిధంగా కొండకింద భాగంలో విద్యుత్ దీపాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్ కుమార్ కుహూరా ప్రత్యేకంగా పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



చిన్నారులకు మిఠాయిలు పంచుతున్న మహాపాత్రో తదితరులు

జయపురం: బీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు జయపురంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొరాపుట్ జిల్లా యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రవీంద్రకుమార్ మహాపాత్రో నేతృత్వంలో వేడుకలను చేపట్టారు. దీనిలో భాగంగా పట్టణంలోని పిల్లలకు మిఠాయి, చాక్లెట్లు పంచారు. రవీంద్ర మహాపాత్రో గత నెలలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో తన సహచరులతో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అప్పటినుంచి కొరాపుట్ జిల్లాలో ముఖ్యంగా జయపురం శాసన సభ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు.

వలస కార్మికుడు మృతి



రమేష్ నాయక్ (ఫైల్)



మృతి చెందిన రమేష్ నాయక్

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి చంద్రగిరి పంచాయతీ కొసానాదొరా గ్రామానికి చెందిన రమేష్ నాయక్ (32) అనే వలస కార్మికుడు విశాఖపట్నంలో గురువారం మృతి చెందాడు. రోడ్డుపక్కన తీవ్ర గాయాలతో పడివున్న నాయక్‌ను విశాఖపట్నం పోలీసులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయాన్ని అతని బంధువులకు పోలీసులు తెలియజేయగా, గురువారం రాత్రి రమేష్ పెద్ద అన్నయ్య సుభాష్ విశాఖపట్నం చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. గత కొద్ది నెలల క్రితం ఉపాధి కోసం విశాఖపట్నం వెళ్లిన రమేష్ అక్కడ ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిసింది. అయితే ఇలా ప్రమాదానికి గురై మృతి చెందడంపై అనుమానాలకు తావిస్తోంది. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలవ్వడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు చెబుతుండగా, మృతుని కుటుంబ సభ్యులు హత్య కావొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులకు మృతుని అన్నయ్య సుభాష్ ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

'శ్రామిక్ కాంగ్రెసు బలం పుంజుకుంటుంది'



మాట్లాడుతున్న రమేష్ చంద్ర సాహు

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే సిబ్బంది సంక్షేమ కార్యకలాపాల్లో శ్రామిక్ కాంగ్రెసు క్రమంగా పుంజుకుంటుందని సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు పేర్కొన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం రైల్వే శాఖ అనుబంధ సహకారంతో నిర్వహిస్తున్న సంక్షేమ సంస్థల కార్య నిర్వహణ బాధ్యతలను చేపడుతుందని పేర్కొన్నారు. జోన్‌వ్యాప్తంగా సంబలపూర్ మండలం మినహా మిగిలిన 2 మండలాలు, జోనల్ ప్రధాన కార్యాలయం, వర్కు షాపు పరిధిలో పలు సంస్థలు పని చేస్తున్నాయన్నారు. ఖుర్దారోడ్ మండలం 6 సంస్థల్లో శ్రామిక్ కాంగ్రెసు అధీనంలో 4 ఇన్‌స్టిట్యూట్లు పని చేస్తున్నాయన్నారు. వీటిలో తూర్పు కోస్తా రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయం, మంచేశ్వర్ వర్కు షాపు, ఖుర్దారోడ్, బరంపురం ఉన్నట్లు పేర్కొన్నారు. వాల్తేరు రైల్వే మండలంలో రాయగడ, కొరాపుట్ మినహా మిగిలిన 9 రైల్వే ఇనిస్టిట్యూట్లు శ్రామిక్ కాంగ్రెసు మద్దతుదారుల కార్యవర్గం కొనసాగుతుందన్నారు. ఆధునిక సదుపాయాలు, సౌకర్యాలతో సిబ్బంది సంక్షేమ కార్యకలాపాలకు ఈ సంస్థలను ఆధునీకీకరిస్తున్నట్లు తెలిపారు.

సోషల్ మీడియాలో ప్రచారం అవసరం



మాట్లాడుతున్న ఈశ్వర్ పాణిగ్రహి, పక్కనే బీజేడీ నాయకులు

కొరాపుట్: ప్రస్తుతం సోషల్ మీడియా వినియోగం పెరిగిన దృష్ట్యా దానికి అనుగుణంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవసరమని కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రహి అన్నారు. జిల్లా కేంద్రంలోని బిజూ పాతాఘర్‌లో బీజేడీ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, ప్రజాహిత కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా చూడాలన్నారు. అందుకు సోషల్ మీడియాను వినియోగించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఇప్పటి నుంచే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలదరికీ చేరాలని సూచించారు. కార్యక్రమంలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడల్, మున్సిపల్ చైర్మన్ లలాటిందు రంజన్ శెఠి, ఈశ్వర్ అల్లాడ, లత రాయ్, పార్వతీ మస్తీ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వలంటీర్ మృతి



సింహాచలం (ఫైల్)

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జవలస పంచాయతీ పరిధి గున్నతోటవలసకు చెందిన వలంటీర్ కంటు సింహాచలం(38) చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్సై జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 11న బొబ్బిలిలోని సచివాలయ ఉద్యోగి వివాహవేడుకకు హాజరైన సింహాచలం తరువాత అదృశ్యమయ్యాడు. దీనిపై కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బొబ్బిలి పట్టణంలోని కోటిచెరువు కాలువలో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి పరిశీలించి ఆ మృతదేహాన్ని వలంటీర్ సింహాచలంగా గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహానికి సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించారు. వలంటీర్ సింహాచలం ప్రమాదవశాత్తు చెరువులో పడిమృతిచెందినట్లు భావిస్తున్నారు. మృతుడికి భార్య శోభారాణి, కుమార్తె శ్రీవల్లి, కుమారుడు లోహిత్‌కుమార్‌లు ఉన్నారు. కుటుబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండ ప్రాంతంలో మృతదేహం లభ్యం



మృతిచెందిన బుధహెబందరం

కురుపాం: మండలంలోని కరండిగూడ–సొబ్బాకొండల్లో మృతదేహం ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న ఎల్విన్‌పేట సీఐ బి.సత్యనారాయణ, నీలకంఠాపురం ఇన్‌చార్జ్ ఎస్సై సీహెచ్ ప్రసాద్ సిబ్బంది కలిసి గురువారం రాత్రి సంఘటనా స్థలానికి వెళ్లారు. ఈ సందర్భంగా స్థానికులను ఆరా తీయగా ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణం పనుల నిమిత్తం జార్ఖండ్‌రాష్ట్రం నుంచి ఇక్కడికి ఆ వ్యక్తి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి దగ్గర ఉన్న ఆధార్ కార్డు ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బుధహెబందరం (51)గా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్టోన్ క్రషర్‌లో కార్మికుడి మృతి



ప్రమాదంలో మృతిచెందిన సూర్యనారాయణ

కురుపాం: స్థానిక బాలాజీ స్టోన్‌క్రషర్‌లో జరిగిన ప్రమాదంలో కార్మికుడు ఆర్.సూర్యనారాయణ (55) మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం కొంకిడివరం గ్రామానికి చెందిన ఆర్.సూర్యనారాయణ(55) సుదీర్ఘకాలంగా క్రషర్‌లో లోడింగ్ చేసే చోట యూనిట్ గేజ్ చూస్తున్నాడు. రోజు లాగానే పనిచేస్తుండగా వాహనానికి లోడింగ్ యంత్రం మధ్యలో నలిగిపోయి నేలకూలిపోయాడు. అది గమనించిన క్రషర్ సిబ్బంది హుటాహుటిన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. కురుపాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుణాత్మక విద్యపై దృష్టి సారించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి విజ్ఞప్తి చేశారు. జయపురం సమితి ఉమ్మిరి సేవాశ్రమ పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా గురువారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే రేపటి దేశ రథ సారథులన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా సంక్షేమ విభాగ అధికారి సునీల్ కుమార్ తండి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న ఒడియా ప్రొఫెసర్ సరోజ్ కుమార్ ప్రహరాజ్ ప్రస్తుత విద్యావిధానంపై ప్రసంగించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యుడు అస్థా నాయిక్, సర్పంచ్ సబితా నాయిక్, సమితి సభ్యులు తిలోత్తమ చండియ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

రాజాం సిటీ: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. ఈ ఘటనపై సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్సై వై.రవికిరణ్‌తో పాటు సిబ్బంది మండల పరిధిలోని చీకటిపేట జంక్షన్ వద్ద వాహనతనిఖీలు చేస్తున్న సమయంలో ఎం.జె వలస వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు గంజాయి సంచితో నడుచుకుంటూ వస్తూ పోలీసులను చూసి కంగారుగా తప్పించుకునే ప్రయత్నం చేశారు. దీంతో వారిని పట్టుకుని సంచిని పరిశీలించి అందులో ఉన్న 310 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి పాలకొండ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

క్లుప్తంగా

ఒకే కాన్పులో మూడు లేగదూడలు


లేగదూడలతో ఆవు

పలాస: మండలంలోని రామకృష్ణాపురం రెవెన్యూ పరిధి కోసంగిపురం గ్రామంలో కింతల మోహనరావుకు చెందిన ఆవు గురువారం అర్ధరాత్రి ఒకేసారి మూడు లేగదూడలకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ఆవు, మూడు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని రైతు తెలిపారు.

పేపరు మిల్లును పరిశీలించిన తహసీల్దార్


కాలిన పేపర్ బండిల్స్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

నరసన్నపేట: మండలంలోని మడపాం వద్ద వంశధార పేపరు మిల్లును తహసీల్దార్ ఏ.సింహాచలం శుక్రవారం పరిశీలించారు. గురువారం రాత్రి పేపరు మిల్లులో అగ్ని ప్రమాదం జరిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మిల్లుకు వెళ్లి ఎండీ రాజేంద్రన్‌తో మాట్లాడి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో రూ.కోటి నష్టం వాటిల్లినట్లు ఎండీ తెలిపారు. ఆయనతో పాటు ఆర్‌ఐ అన్వేష్, వీఆర్వో ఎం.అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

డీఐజీకి సత్కారం


డీఐజీ హరికృష్ణను సన్మానిస్తున్న వీసీ, వర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం సందర్శించిన విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణను వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, వర్సిటీ అధికారులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వర్సిటీలో నిర్వహిస్తున్న కోర్సులు, సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య పాల్గొన్నారు.

భౌతికదాడులు తగవు


నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

కవిటి: రాష్ట్రంలో విద్యాప్రమాణాల అభివృద్ధికి విశేష సేవలందిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, కడప ఆర్జేడీ ప్రతాపరెడ్డిపై నిద్రిస్తున్న సమయంలో గురువారం రాత్రి దుండగులు జరిపిన భౌతికదాడి అత్యంత గర్హనీయమైనదని ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి అన్నారు. దాడిని ఖండిస్తూ శుక్రవారం కవిటి మండలం సహలాలపుట్టుగ జెడ్పీ ఒడియా ఉన్నత పాఠశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్యలకు బాధ్యులైన వారిని గుర్తించి తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రోన్ పైలటింగ్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులు డ్రోన్ పైలటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని చెన్నైకి చెందిన గరుడ డ్రోన్ సర్వీసెస్ రిసోర్సుపర్సన్ ప్రధాన్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం గరుడ డ్రోన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో డ్రోన్ పైలటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో ఎక్కువగా డ్రోన్ సేవలు వినియోగిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం వీఐపీ భద్రత, భూసర్వేలు, పంట తెగుళ్ల నియంత్రణకు పురుగుల మందులు పిచికారీ వంటి వాటికి వినియోగిస్తున్నారని తెలిపారు.

కషాయం తయారీపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: వావిలాల ఆకుల కషాయంతో పంటల్లో తెగుళ్లను అరికట్టవచ్చునని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ధనుంజయ్ అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేటలో శుక్రవారం వావిలాల ఆకు కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కషాయంతో ఖర్చు లేకుండా తెగుళ్ల నియంత్రణ సాధ్యంగా వివరించారు.

ఆధ్యాత్మిక సిరులు.. మహేంద్ర గిరులు


గిరులపై ప్రకృతి అందాలు

- మహా శివరాత్రికి ప్రత్యేక యాత్ర
- లక్షల మంది భక్తులు రాక

మందస:

ఏడాది పొడవునా నిశ్శబ్దంగా ఉన్న ఆ గిరుల ప్రాంతం మహా శివరాత్రి జరిగే మూడు రోజులు మాత్రం భక్తిచైతన్యంతో నిండిపోతుంది. హేబిమ్మో... హేబిమ్మో... అంటూ పచ్చని అరణ్యం మధ్య నుంచి భక్తుల జనఘోష వినిపిస్తుంటుంది. దట్టమైన ఆంధ్రా–ఒడిశా అడవుల మధ్య ఉన్న మహేంద్రగిరికి కొండంత భక్తితో భక్తులు తరలివస్తారు. దక్షిణ భారతదేశంలో తూర్పు కనుమల్లో అతి ఎత్తయిన శిఖరం మహేంద్రగిరులు. పెద్ద పెద్ద వృక్షాలు, లోతైన లోయలు, అమూల్య ఔషధ మూలికలు, ప్రకృతి సౌందర్యమే కాకుండా ఆధ్యాత్మిక వైభవాన్ని కలిగిన ఈ మహేంద్రగిరులు తూర్పు కనుమల్లోని గంజాం జిల్లా ఒడిశా–ఆంధ్రా సరిహద్దులో విస్తరించి ఉన్నాయి. సముద్రానికి సుమారు ఐదు వేల అడుగుల ఎత్తులో ఉంది.


సుందర సూర్యోదయం

మందసకు 40 కిలోమీటర్ల దూరం..

మహాశివరాత్రి సందర్భంగా మహేంద్ర గిరులపై జరిగే యాత్రకు ఏటా లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. మందస గ్రామానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. భక్తులు మజిలీ చేసుకుంటూ కేవలం కాలినడకనే గిరులపై ఉన్న ఆలయాల వద్దకు చేరుకుంటారు. రవాణా సౌకర్యంలేని ఎత్తయిన కొండపైకి పెద్ద పెద్ద రాళ్లు ఎలా తరలించారో, ఎందరు శిల్పులు శ్రమించారో ఊహించడం కష్టం. భక్తులు ముందుగా చేరుకునే కుంతీదేవి ఆలయం. రెండు కొండల మధ్య, ముఖద్వారం పశ్చిమ దిశగా ఉంటుంది. దక్షిణ భాగాన విఘ్నేశ్వరుడు, తూర్పున కుమారస్వామి, ఉత్తరాన పార్వతీదేవి విగ్రహాలు ఆలయం వెలుపల ఉంటాయి. ఎదురుగా మంచినీటి బావి ఉంది. ఇదే లక్షలాది మంది యాత్రికులకు నీరు అందిస్తుంది. కుంతీదేవి ఆలయానికి దగ్గరలో ధర్మరాజు ఆలయం ఉంది. భూమిలోకి కొంతభాగం దిగినట్టు ఉండే ఈ ఆలయంలోకి భక్తులు మెట్ల ద్వారా దిగి, వెడల్పుగా, పొట్టిగా ఉన్న లింగాన్ని దర్శించుకుంటారు. కుడి పక్కగా పురిగుడిసెలా ఉండే మరో ఆలయం సహదేవుడి గుడి. దానికి ఎదురుగా కొద్దిదూరంలో నకుల, ద్రౌపది ఆలయాలుంటాయి. ధర్మరాజు ఆలయానికి ఎదురుగా పశ్చిమదిశ వైపు నాలుగు కొండ శిఖరాలున్నాయి. వీటిలో మధ్య రెండు శిఖరాలపై భీమార్జున ఆలయాలున్నాయి.

స్థల పురాణం..

అర్జునుడు మనోవేగం కలవాడై, ఇంద్రనీర పర్వతం చేరి, ఇంద్రుని సాక్షాత్కారం పొంది, సర్వేశ్వరుని అనుగ్రహానికి మహాగిరి వచ్చాడని, ఆ మహాగిరే మహేంద్రమని చెబుతారు. త్రేతాయుగంలో క్షత్రియులను సంహరించి శపథాన్ని నెరవేర్చుకున్న పరశురాముడు కోటి శివలింగాలతో ప్రకాశించే శైవ క్షేత్రమైన సప్తకుల పర్వతాల్లో ఒకటైన మహేంద్రగిరి శిఖరంపై తపోస్సాధనకు వచ్చాడని, ఈ కాలంలో సంపాతితో సంభాషించే సీతాన్వేషణకు సాగరాన్ని దాటించేందుకు హనుమంతుడు కూడా మహేంద్ర గిరుల నుంచే వెళ్లాడని ప్రతీక.


శిఖరంపై శివనాగుడు

మహేంద్రగిరి యాత్రకు ప్రత్యేక బస్సులు

కాశీబుగ్గ: మహేంద్రగిరి పర్వతాలపై శివరాత్రి నాడు జరిగే యాత్రకు పలాస ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. పలాస నుంచి మందస మండలం సాబకోట వరకు రూ.50 చార్జితో ప్రతీ అర గంటకు ఒక బస్సును నడుపుతున్నారు. పలాసలో బయలుదేరి కాశీబుగ్గ బస్టాండ్ వద్ద యాత్రికులను ఎక్కించుకుని రామకృష్ణాపురం, మకరజోల, హరిపురం జంక్షన్, మందస మీదుగా సాబకోటకు చేరుకుంటుంది. రైల్వేమార్గంలోనైతే పలాస రైల్వే స్టేషన్‌లో దిగాలి. అక్కడి నుంచి బస్సు ద్వారా చేరుకోవాలి.


బస్సు వద్ద ఆర్టీసీ అధికారులు

శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

శ్రీకాకుళం అర్బన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనార్థం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరింది. శనివారం ఉదయం 8 గంటలకు శ్రీశైలం చేరుకుంటుంది. స్వామి దర్శనం అనంతరం సాయంత్రం శ్రీశైలంలో బయలుదేరి ఆదివారం మధ్యాహ్నానికి శ్రీకాకుళం చేరుకుంటుందని ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రాజు, ఎస్‌ఎం శామ్యూల్, ఓపీఆర్‌ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా, టీఐ-3 నాయుడు, ఏడీసీ రాజు, ఎంపీ రావు పాల్గొన్నారు.

సూదిమొనపై శివలింగం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన సూక్ష్మచిత్ర కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి సూదిమొనపై బంగారు శివలింగాన్ని తయారు చేశారు. 0.25 మిల్లీ గ్రాముల బంగారంతో అర సెంటీమీటరు పొడవున ఈ కళాఖండాన్ని రూపొందించి భక్తిని చాటుకున్నారు.


బంగారు శివలింగం

భార్యపై అనుమానం
బలిగొంది కూతురి ప్రాణం

- భార్యపై కత్తితో దాడి చేసిన భర్త
- అడ్డుకునేందుకు వచ్చిన కుమార్తె బలి
- తీవ్ర గాయాలతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న తల్లి
- సొట్టవానిపేటలో దారుణం

ఆమదాలవలస:

అనుమానం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. తల్లిని చంపబోతున్న తండ్రిని అడ్డుకునే క్రమంలో కుమార్తె హత్యకు గురైంది. ఈ విషాద ఘటన ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని సొట్టవానిపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆమదాలవలస సీఐ పైడియ్య తెలిపిన వివరాల ప్రకారం.. సొట్టవానిపేటకు చెందిన కొలుసు రామారావు, సూర్యం భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమార్తె, పెద్ద కుమారుడికి వివాహాలు కాగా చిన్న కుమారుడు, చిన్న కుమార్తె ఇంటి వద్దే ఉంటున్నారు. తండ్రీ, పెద్ద కుమారుడు కల్లుగీత కార్మికులు కాగా, చిన్న కుమారుడు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. రామారావు తన భార్యపై అనుమానంతో మూడేళ్లుగా వేధిస్తుండేవాడు. భార్యను, పెద్దకుమారుడిని ఎప్పటికైనా చంపేస్తానని తరచూ గొడవపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో కుటుంబంలో తరచూ కలహాలు జరుగుతుండేవి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 10.45 గంటల సమయంలో రామారావు తన భార్య సూర్యంపై వొలుపు కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఆ సమయంలో కుమార్తె విజయ(25) అడ్డుకోగా ఆమె మెడపై దారుణంగా కత్తితో నరికాడు. దీంతో విజయ రక్తపు మడుగులో కొట్టుకుంటూ అక్కడే ప్రాణాలు వదిలింది. సూర్యం చేతిపై కత్తి వేటు పడటంతో తీవ్రంగా గాయపడింది. కొన ఊపిరితో ఉన్న సూర్యంను గ్రామస్తులు 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. విజయ మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి శవపంచనామా కోసం తరలించారు. ఆమదాలవలస సీఐ పైడియ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని క్లూస్‌టీం పరిశీలించింది. పరారీలో ఉన్న నిందితుడు రామారావును పట్టుకుంటామని సీఐ తెలిపారు. కల్లు గీతకు వాడే వొలుపు కత్తినే ఈ హత్యకు వినియోగించాడని పోలీసులు చెబుతున్నారు.


రక్తపు మడుగులో ఉన్న మృతురాలు విజయ (ఇన్‌సెట్లో) విజయ (ఫైల్)


హత్యకు పాల్పడిన రామారావుతో భార్య సూర్యం (ఫైల్)

గ్రామంలో కలకలం..

సొట్టవానిపేటలో హత్య జరిగిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. కుటుంబ సభ్యులతో ఎప్పుడూ గొడవపడే రామారావు ఇంతటి దారుణానికి ఒడిగడతాడని ఊహించలేదని కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఏ తప్పు చేసినా హత్య చేసినంత వరకు తెగించడం సరికాదని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్ల ప్రకటన

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో ఈ నెల 14 నుంచి 16 వరకు రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-14 బాల బాలికల రాష్ట్ర జట్ల వివరాలను ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు శుక్రవారం ప్రకటించారు. అంతకుముందు జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో గుంటూరు, చిత్తూరు, కృష్ణా, విజయనగరం తొలి నాలుగు స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం, గుంటూరు తొలి నాలుగు స్థానాలు సాధించాయి. బాలుర జట్టుకు ఎస్.రాకేష్(శ్రీకాకుళం), ఎస్.గణేష్, కె.సందీప్(విజయనగరం), ఎస్.దుష్యంత్‌కుమార్(కర్నూలు), జి.ఎస్.పృథ్వీసాగర్(గుంటూరు), జి.ప్రకాష్, బి.హరినాయక్(విశాఖ), కె.రామ్‌చరణ్(పశ్చిమగోదావరి), ఈ.చందు(కృష్ణా), పి.బాలాజీ(చిత్తూరు), భూలోకం(తూర్పుగోదావరి), వి.ప్రదీప్(గుంటూరు) ఎంపికయ్యారు. బాలికల జట్టుకు ఎస్.సోని, ఎం.సుమశ్రీ, పి.షమీద(గుంటూరు), పి.జశ్విత(అనంతపురం), ఈ.జాహ్నవి, బి.మానస(చిత్తూరు), సీహెచ్.శ్రీపద్మజ, సీహెచ్.తన్వీశ్రీ(కృష్ణా) ఎస్.పూజిత(ప్రకాశం), పి.లక్ష్మీప్రసన్న, వి.కుసుమప్రియ(వైఎస్‌ఆర్ కడప), వి.లీలామన్విత(శ్రీకాకుళం) ఎంపికయ్యారు.

అక్రమ గ్రానైట్ బ్లాకులకు జరిమానా

టెక్కలి: ఈ నెల 8న ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి జాతీయ రహదారి మీదుగా కోటబొమ్మాళి మండలం నిమ్మాడ సమీపంలోని గ్రానైట్ పాలిషింగ్ పరిశ్రమలకు అక్రమంగా తరలిస్తూ విజిలెన్స్ అధికారులకు పట్టుబడిన గ్రానైట్ బ్లాకులకు రూ.9 లక్షల జరిమానా విధించారు. మైన్స్ అధికారులు కళ్లుగప్పి జాతీయ రహదారి మీదుగా నాలుగు వాహనాల్లో 8 గ్రానైట్ బ్లాకులు తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు మెరుపు దాడి చేశారు. వాహనాలను తనిఖీ చేయగా పాత బిల్లులతో గ్రానైట్ బ్లాకులను తరలిస్తున్నట్లు తేలింది. కొన్ని వాహనాల్లో పరిమితికి మించిన బరువుతో రవాణా చేస్తుండడంతో మైన్స్, మోటార్ వెహికల్ చట్టం ప్రకారం రూ.9 లక్షల జరిమానా విధించారు. కొద్ది రోజుల క్రితం టెక్కలి నుంచి మెళియాపుట్టి రోడ్డులో అక్రమంగా గ్రానైట్ బ్లాకులను తరలిస్తూ విజిలెన్స్ అధికారులకు పట్టుబడిన వాహనానికి సుమారు రూ.2 లక్షల 50 వేల జరిమానా విధించారు.

విజిలెన్స్‌కే పట్టుబడుతున్నాయ్...

ఇటీవల కాలంలో గ్రానైట్ బ్లాకుల అక్రమ తరలింపు వాహనాలు కేవలం విజిలెన్స్‌కే అత్యధికంగా పట్టుబడుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానికంగా మైన్స్ అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ వద్ద అత్యధికంగా గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ పరిశ్రమలు ఉన్నాయి. జాతీయ రహదారి పొడవునా అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ బ్లాకులు అత్యధిక శాతం నిమ్మాడ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో పాలిషింగ్ యూనిట్లకు చేరుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో ఆయా పాలిషింగ్ పరిశ్రమల్లో మైన్స్ అధికారులు తనిఖీలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


కోటబొమ్మాళి వద్ద విజిలెన్స్ అధికారులకు పట్టుబడిన అక్రమ గ్రానైట్ బ్లాకులు (ఫైల్)


టెక్కలి సమీపంలో విజిలెన్స్ అధికారులు పట్టుకున్న అక్రమ బ్లాకులు(ఫైల్)

'ఆఫ్‌షోర్' పెండింగ్ పనులపై దృష్టి సారించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని మహేంద్రతనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్ట్ (రేగులపాడు రిజర్వాయర్) పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆఫ్‌షోర్ ప్రాజెక్ట్, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో పెండింగ్ పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు వివిధ శాఖల ద్వారా 38 పనులు అప్పగించినట్లు చెప్పారు. అందులో 13 పూర్తికాగా, 25 ప్రగతి దశలో ఉన్నాయని వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ బి.నవ్య, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ జి.జయదేవి, వంశధార పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమలరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

● ముస్తాబైన ముఖలింగేశ్వరుడు


ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. శనివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. – జలుమూరు

శుభ్రత మెరిసి.. సంపద మురిసి..!

- సత్ఫలితాలనిస్తున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం
- వర్మీకంపోస్టు ద్వారా రూ. 6.55 లక్షలు, పొడి చెత్తతో రూ.5.81 లక్షల ఆదాయం
- గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరుగా ఎస్‌డబ్ల్యూపీఎస్ కేంద్రాలు

అరసవల్లి:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్న స్వచ్ఛ సంకల్పం' కార్యక్రమం లక్ష్యం దిశగా పయనిస్తోంది. ఓ వైపు పారిశుద్ధ్యం మెరుగుపడి ప్రజారోగ్యానికి రక్షణగా నిలవడంతో పాటు మరోవైపు గ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరుగా తోడ్పాటునందిస్తోంది. స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఏర్పాటైన ఘన వ్యర్థ పదార్థాల సంపద కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీఎస్) ఎంతో మందికి జీవనోపాధి కల్పిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతానికి క్లాప్ మిత్ర సిబ్బంది సుమారు 2347 మంది పనిచేస్తూ.. ఉపాధి పొందుతున్నారు.

చిత్తశుద్ధిగా చెత్త శుద్ధి..

చెత్త నిర్వహణ సరిగ్గా లేకపోతే జరిగే అనర్థాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పల్లె శుభ్రతకు పెద్దపీట వేసింది. ఈ క్రమంలో అమలు చేస్తున్న జగనన్న స్వచ్ఛసంకల్పంతో గ్రామాలు స్వచ్ఛంగా తయారవుతున్నాయి. పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుతో పాటు అదనంగా పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. జిల్లాలో 912 గ్రామ పంచాయతీలకు గాను ప్రస్తుతానికి 643 పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీఎస్ కేంద్రాలు నడుస్తున్నాయి. వివిధ దశల్లో 269 పంచాయతీల్లో షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పూర్తయిన షెడ్లలో వర్మీ కంపోస్టు తయారీని జిల్లాలో చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారు.

వర్మీ కంపోస్టు తయారీ ఇలా..

- జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 5.49 లక్షల ఇళ్లు ఉండగా, సరాసరి ఒక్కో గ్రామంలో 250 ఇళ్ల నుంచి రోజుకు కుళ్లిన చెత్త 12 నుంచి 15 కేజీలు, పొడి చెత్త 8 నుంచి 10 కేజీల వరకు సేకరణ జరుగుతున్నట్లుగా లెక్కలు చెబుతున్నాయి.
- ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీఎస్ కేంద్రాలకు వాహనాల ద్వారా తరలించి తడిచెత్త, పొడి చెత్తగా వేరుచేస్తున్నారు. వేరు చేసిన ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, గాజు సీసాలు, పాడైన బ్యాటరీలు, ఎలక్ట్రికల్ వస్తువులు, పనికిరాని నోటు పుస్తకాలు, అట్టపెట్టెలు, ఐరన్ వస్తువులు, ఇతర ఘన వ్యర్థ పదార్థాలను 13 రకాల తొట్టెల్లో నింపి వీలైనంతలో వీటిని విక్రయిస్తున్నారు.
- కుళ్లిపోయే స్వభావం కలిగిన పశువుల పేడ, మిగిలిపోయిన ఆహార పదార్థాలు, కొబ్బరి పీచు, కూరగాయల తొక్కలు, పచ్చగడ్డి, ఎండు గడ్డి, వంటగదుల్లో వ్యర్థ పదార్థాలను సేకరించి ప్రత్యేకంగా వేరు చేసిన తొట్టెల్లో లేయర్లుగా విభజించి అందులో 45 రోజుల పాటు వానపాములు వదిలి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు.
- ఇలా తయారు చేసిన ఎరువును సేంద్రీయ వ్యవసాయ విధానంగా పెరటి మొక్కల పెంపకం దారులు, వ్యవసాయ పొలాల్లో ఎరువుగా వేసుకునే రైతులకు కిలో రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. రహదారుల నిర్మాణానికి సిద్ధం చేస్తున్న పొడి చెత్తను కిలో గరిష్ఠంగా రూ.7కి విక్రయిస్తున్నారు.
- ఇంతవరకు జిల్లాలో 81,416 కేజీల వర్మీకంపోస్టు విక్రయాల ద్వారా రూ.6,55,023, అలాగే 81,925 కేజీల పొడి చెత్త విక్రయాల ద్వారా రూ.5,81,810 ఆదాయం లభించింది. ఈ ఆదాయాన్ని ఆయా పరిధి గ్రామ పంచాయతీల జనరల్ ఫండ్‌లో జమ చేస్తున్నారు.
- ఎస్‌డబ్ల్యూపీఎస్ కేంద్రాల వద్దకు చేరిన 100 కేజీల కుళ్లిన చెత్తతో 35 కేజీల వర్మీ కంపోస్టు తయారవుతుంది. 100 కేజీల పశువుల పేడ నుంచి కూడా 35 కేజీల వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారు.
- 50 మైక్రాన్ల కంటే తక్కువున్న ప్లాస్టిక్ వ్యర్థాలు (డ్రై)తో రహదారుల నిర్మాణానికి కూడా సిద్ధమవుతున్నారు. ఇందుకోసం జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎనిమిది మెటీరియల్ రికవరీ యూనిట్లను ఏర్పాటు చేశారు.


చెత్త సేకరణ విధానంపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీ సీఈఓ వెంకట్రామన్, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ వెంకటరాజు

లోకల్ ట్రైనింగ్ సెంటర్లు సిద్ధం..



జిల్లాలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల నిర్వహణ, వర్మీ కంపోస్టు విక్రయాల విషయంలో మరింత అవగాహన కోసం జిల్లాలో రాగోలు, లావేరు, అవలింగి, నందిగాం, కంచిలి కేంద్రాలను లోకల్ ట్రైనింగ్ సెంటర్లుగా గుర్తించాం. ఇక్కడ ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ, వెటర్నరీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వనున్నాం. త్వరలో రైతు భరోసా కేంద్రాల్లో కూడా వర్మీకంపోస్టు విక్రయాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నాం. డీపీఆర్సీ ప్రిన్సిపాల్‌గా జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, వైస్ ప్రిన్సిపాల్‌గా డీపీఓ వి.రవికుమార్‌ల పర్యవేక్షణ, సూచనల మేరకు అన్ని పంచాయతీల నుంచి ప్రస్తుతానికి 75 శాతం ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తున్నాం. వీటి ద్వారా రికార్డు స్థాయిలో వర్మీ కంపోస్టు తయారీకి సన్నద్ధమవుతున్నాం.
– పి.వెంకటరాజు, డీపీఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్


వర్మీ కంపోస్టు తయారీలో భాగంగా వ్యర్థాలను తొట్టెల్లోకి డంప్ చేస్తున్న క్లాప్‌మిత్రలు